# నివురు

**-నిష్ఠల రామలింగస్వామి**

**వి**శ్వం మిత్రుడు శర్మ మనసు మంచిదే. కాకపోతే కాస్త కటువు మనిషి. నిష్టు. శర్మ భార్య హైమవతిది పూర్తిగా భిన్న స్వభావం. హిమంలా ఎప్పుడూ చల్లగానే ఉంటుంది. సరళ స్వభావం. ఆమెకేమో పుట్టపర్తి సందర్శించాలన్న కోరిక. సహజంగానే శర్మ ఆమె అభిప్రాయానికి విలువ ఇవ్వడు.

"అన్నయ్యా, పుట్టపర్తి వెళ్లి స్వామిని దర్శించుకోవాలని ఎప్పటినుంచో కోరిక. ఆయనేమో నా అభిప్రాయాన్ని గౌరవించదు. ఎలాగైనా నువ్వే ఆయన్ని ఒప్పించాలి" అని విశ్వాన్ని బతిమాలింది హైమవతి.

"మంచి ఆలోచనే. కాకపోతే వాడేమంటాడో?..." అంటూ సందేహం వ్యక్తంచేశాడు విశ్వం.

"ఆ బాధ్యత నీదే అన్నయ్యా. ఆయన్ని ఎలాగైనా ఒప్పించు" అంటూ ప్రాధేయపడింది హైమవతి.

మిత్రుడి పోరు పడలేకో, భార్య సాధింపు భరించలేకో- ఎలాగైతేనేం శర్మ పుట్టపర్తి యాత్రకు అంగీకరించాడు.

"ఇలా యాత్రలంటూ వేలకు వేలు ఖర్చుచేసే బదులు- ఈ డబ్బు ఏ పేదవాడికో ఇస్తే సంతోషించడా?" అని నిష్టురమాడాడు శర్మ.

"ఎందుకు సంతోషించరు. కానీ అలా చేయాలి కదా. ఇలా అయితే కొత్త ప్రదేశాలు చూసినట్టూ ఉంటుంది, తృప్తీ మిగులుతుంది."

ఇలా తర్క వితర్కాలు, కబుర్లు, సరదాలతో కాలం తెలియకుండా పుట్టపర్తి చేరారు. ఒక్కసారిగా కొత్త వాతావరణంలోకి అడుగుపెట్టినట్టుంది. గుంపులు గుంపులుగా భక్తులు. ప్రశాంత వదనాలతో, తెల్లని విభూతి బొట్లతో "సాయిరాం, సాయిరాం..." అంటూ నామజపం.

ప్రశాంతి నిలయం గేటు దగ్గర సెక్యూరిటీ ఉండడం చూసి శర్మ నవ్వేడు.

"ఎందుకురా ఆ నవ్వు?" అని ప్రశ్నించాడు విశ్వం.

"మరేం లేదు, దేవుడి దగ్గర సెక్యూరిటీ ఏంటని?"

"అదా నీ సందేహం. శ్రీమహావిష్ణువు వైకుంఠంలో కదా ఉంట. ఆయన్ని చూడ్డానికొచ్చిన భక్తులను గేటు కాపలాదారులైన జయ-విజయులు అడ్డుతారు. ఎందుకడ్డుతారు? అది కూడా సెక్యూరిటీయే కదా. అలాగే ఇదీను" అని చెబుతూనే ఎదురుగా ఉన్న బాబా ఫొటోకి నమస్కరించాడు విశ్వం.

"ఆ పరంధాముడిని మనం చూడలేదు. జయ-విజయులు ఉన్నారో లేరో తెలియదు. ఇప్పుడీయన నేనే దేముడిని అంటున్నాడు కదా. ఎవరు ఎలాంటి వారో తెలుసు కదా. అన్ని శక్తులూ ఉన్నాయంటారు కదా. మరి ఈ భద్రత ఎందుకు? సంకల్ప మాత్రంతోనే అన్నీ నెరవేర్చుకోవచ్చు కదా."

"నీ సంశయం అర్థమయింది. శ్రీరాముణ్ణి నువ్వు చూసేవా? లేదే! ఆయన శ్రీమహావిష్ణువు అవతారమే అంటున్నారు కదా. హిందువుల ఆరాధ్య దైవం ఆ రామచంద్రుడే కదా. అటువంటప్పుడు ఆయన వానర సహాయం ఎందుకు కోరేడు? రావణుడిని కనిపెట్టలేకా, ఒక్క వేటుతో కూల్చలేకా? కాదు. దీనర్థం ఏమిటంటే, శ్రీరాముడు మనిషిగా ఉన్నాడు. మానవ ప్రవృత్తిలోనే ప్రవర్తించాడు. అందుకే 'మాయా మానుష విగ్రహం' అన్నారాయన్ని. అలానే ఈ సత్యసాయిబాబానూ."

దీంతో శర్మ ఏమీ మాట్లాడలేక బ్యాగ్ సర్దుతున్నట్టు నటించాడు. హైమవతి భర్త పరిస్థితికి నవ్వుకుంది.

## భావనమే జీవనం

**జీ**వితం అన్నిటికంటె విలువైంది
అతిలోక సౌందర్యంకన్నా/ అవిరళ సౌభాగ్యం కన్నా
అభేద్య సింహాసనం కన్నా
భావనమే అన్నిటికంటె విలువైంది
భావనమే జీవనానికి మూలం
భావన మాత్రమే చేస్తుంది మాయాజాలం
నీవు క్రుంగిపోతున్నా/ నింగిలోకి ఎగిరిపోతున్నా
నిఖిల విశ్వంలో కలియదిరుగుతున్నా
భావనమే నీకు జీవనాన్నిస్తోంది
భావనమే ఆరోగ్యం / భావనమే ఐశ్వర్యం
భావనమే ఆలంబనం / భావనమే సర్వస్వం
దాన్ని నిర్లక్ష్యం చేశావా ప్రమాదమే!
దాన్ని అదుపులో పెట్టావా
తరతరాలూ నీకు దక్కేది ప్రమోదమే!!

**-డా॥ అయాచితం నటేశ్వరశర్మ**

ఆ రోజు ఏకాదశి. భక్తులు చాలామందే ఉన్నారు. విశ్వం ఎవరితోనో మాట్లాడి చిన్న రూమ్ సంపాదించాడు. స్నానాదులు ముగించి ఏడు గంటల దర్శనానికి తయారయ్యారు.

"మీరు వెళ్ళిరండి" అన్నాడు శర్మ.

"అదేంటండీ, ఇంత దూరం వచ్చి బాబా దర్శనానికి రారా?" విస్తుపోయింది హైమవతి.

"వాడితో అనవసరమైన వాదన ఎందుకమ్మా. మనం వెళ్లొద్దాం పద" అన్నాడు విశ్వం.

ఓ గంటలో దర్శనం చేసుకుని రూమ్‌కి తిరిగొచ్చారు విశ్వం, హైమవతి. అప్పటికే శర్మ కాఫీ, టిఫిన్ తెచ్చిపెట్టాడు. అందరూ కలిసి ఆ కార్యక్రమం పూర్తికానిచ్చారు.

"ఎంత బాగుందండీ ప్రశాంతి నిలయం. ఎంత నిశ్శబ్దం. అంత డిసిప్లిన్ మెయింటెయిన్ చెయ్యడం ఎక్కడా చూడలేదు" అంటూ తన అనుభూతులను భర్త శర్మతో పంచుకుంది హైమవతి.

"అదే ఇక్కడి గొప్పతనం" అన్నాడు విశ్వం.

శర్మ ఏమీ మాట్లాడకుండా వింటూ కూర్చున్నాడు.

"ఒరే శర్మా, బాబా దర్శనానికి ఎటూ రాలేదు. అలా ఊరన్నా చూసొద్దాం పద. ఇక్కడ చూడదగిన ప్రదేశాలు చాలానే ఉన్నాయట. అందమైన భవనాలు, జూపార్కు, నక్షత్ర యంత్రం, కాలేజీలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఉపన్యాస వేదిక, ఏరోడ్రోమ్... ఒకటేమిటి! ఒకనాటి అతి చిన్న కుగ్రామం నేడు ఎన్నెన్నో సదుపాయాలను సంతరించుకున్నది. దీనికంతటికీ ఆధ్యాత్మిక ఔన్నత్య ప్రభావమే. శ్రీ సత్యసాయి మహాత్మ్యమే!"

దీనికీ శర్మ మాట్లాడలేదు. అయితే ఊర్లో తిరిగి రావడానికి అంగీకరించడంతో ముగ్గురూ కలిసి అన్ని స్థలాలు చూసి వచ్చారు.

సాయంత్రం దర్శనానికి మళ్లీ భక్తులు హాజరవుతున్నారు. ఈ ఒక్కసారికి బాబా దర్శనానికి తమతో రమ్మని హైమవతి, విశ్వం ప్రాధేయపడడంతో శర్మ అంగీకరించాడు. ముగ్గురూ వెళ్లి భక్తులతో పాటు ఆశీనులయ్యారు.

వాలంటీర్లు బ్యాడ్జీలు ధరించి అక్కడక్కడ నిలబడి భక్తులను పర్యవేక్షిస్తున్నారు. గేటు దగ్గర మాత్రం లోపలికి వస్తున్న వారికి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. శర్మ అటే చూస్తూ కూర్చున్నాడు.

శర్మ వీపు తట్టి "బాబాగారొస్తున్నారు" అని విశ్వం అనడంతో శర్మ చటుక్కున చూశాడు.

ఇదే ప్రథమం శర్మ బాబాని చూడడం. అల్లంత దూరం నుంచే బాబాగారు చేయెత్తి అందర్నీ ఆశీర్వ

## నిన్ను చూసేందుకే...

నిన్ను చూసేందుకే
నేను ఒంటరినయ్యాను...
నిన్ను పలకరించేందుకే
నేను మాటలు రానిదానినయ్యాను
నీతో సహచర్యానికై
నా దినచర్యను మరచిపోయాను
నిన్ను పూర్తిగా నమ్మినందుకే
నేను కన్నీళ్లను విస్మరించాను
నాలో నిన్ను చూసుకునేందుకే
నా గుండె గదిని ఖాళీచేశాను
నిన్ను కాదన్నందుకే
నేను ఎవ్వరికీ కాకుండా పోయాను
నువ్వు వద్దన్నందుకే
నా మనసుకు అతుకు వేసుకుంటున్నాను
నువ్వు స్మరించినందుకే
నా పేరును అపురూపంగా చూసుకుంటున్నాను
నిన్ను రమ్మన్నందుకే
నా స్వరాభిషేకం చేయిస్తున్నాను
నువ్వు తోడున్నందుకే
నీ నీడలా నిలుచున్నాను
నువ్వు దూరమయినందుకే
నీ పాదాల నవ్వడిని నా చిహ్నాలుగా మిగుల్చుకున్నాను
ఉలితాకితే కఠిన శిల అయినా శిల్పంగా మారుతుంది
ప్రేమ స్పర్శ తాకిన ప్రతి గుండె గ్రంథంగా మారుతుంది
మహాకవనాలు సందర్శించిన మగువ కనులు
మహాకావ్యాలుగా మారుతాయి.
వాస్తవంలో విలువల ప్రతిరూపం
నువ్వు నన్నొదిలి జీవితంవైపుకు అడుగులు వేసే దృశ్యం..!!!
జీవితంలో విషాదంలోని విషాదం,
నిన్ను విడిచి నేను దూరమయ్యే సన్నివేశం...!!

-శైలజామిత్ర

దించినట్లు ఊపుతున్నారు. మధ్య మధ్యలో అరచేతిని గాలిలో ఇలా అలా తిప్పుతున్నారు.

అంతమంది భక్తులు అక్కడ గుమిగూడినా పిన్ డ్రాప్ సైలెన్స్. అందరూ కూర్చునే దండాలు పెడుతున్నారు. ఎవరితోనో దగ్గరకెళ్లి బాబా మాట్లాడుతున్నారు. మరెవరికో అరచేయి తిప్పి విభూది సృష్టించి ఇచ్చారు. వాళ్ళది మహా ప్రసాదంలా కళ్ళకద్దుకుని నాలుక మీద వేసుకుని, బొట్టు పెట్టుకున్నారు. చిన్న బాలుడు పలక పట్టుకుని నిల్చున్నాడు. స్వామి వచ్చి బాలుడి చేతిలోని పలక తీసుకుని "ఓం" అని రాసి, ఆశీర్వదించారు. భక్తులు మోకాళ్ల మీద నిలబడి చేతులు జోడించి మాట్లాడుతున్నారు. చాలామంది ఉత్తరాలు ఇచ్చారు. వాటినన్నింటినీ బాబా అందుకున్నారు. అలా బాబా వస్తూ వస్తూ హైమవతిని చూసి ఆగారు. చటుక్కున ఆమె భక్తిపారవశ్యంతో పాదనమస్కారం చేసుకుంది. నిర్వికల్పంగా స్వామి ఆమె తలమీద చేయివేసి ముందుకు నడిచారు. విశ్వం, శర్మ పక్కనే ఉన్నా బాబా చూడనే లేదు. ముగ్గురూ మరికొంతసేపు అక్కడ గడిపి గదికి తిరిగొచ్చేశారు.

"ఎలా ఫీలయ్యావు స్వామిని చూసి?" శర్మని అడిగాడు విశ్వం.

"అబ్బే! నేనేం ఫీలవలేదు. ఆయనా మనలాంటి మనిషే. అదృష్టం వరించింది కనుక అందరిచేతా దండాలు పెట్టించుకుంటున్నారు. చందాలు బాగానే వస్తాయనుకుంటా. అంతేగానీ ఆయన్ను నేనేం గొప్పగాను, ప్రత్యేకంగానూ చూడలేదు" అంటూ బదులిచ్చాడు శర్మ.

"సరే, మీ అభిప్రాయం మీది. రేపు ఉదయం మరొక్కసారి దర్శనం చేసుకుని మన ఊరెళ్లిపోదాం" అంది హైమవతి.

దానిని విశ్వం బలపరిచాడు. శర్మ ఇక తప్పదన్నట్టు సరేలే అన్నాడు.

ఇంతలో మైక్‌లో ఎనౌన్స్‌మెంట్. బాబా సాయి కుల్వంత్‌లో ప్రత్యేకంగా సందేశం ఇస్తారని. అది వింటూనే భక్తులంతా పరమానంద భరితులయ్యారు. బిగ్గరగా దైవస్మరణ చేయడం మొదలుపెట్టారు. అందరూ హాలువైపు బయలుదేరారు. వాలంటీర్లు అతి సున్నితంగా, ప్రేమపూర్వకంగా సహాయ సహకారాలు అందజేస్తున్నారు. తెలియని వారికి దారి చూపుతున్నారు. ఏ కట్టడం చూసినా పొందికగా ఉంది. పరిసరాలన్నీ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉన్నాయి. అవన్నీ చూసి 'శాంతికి చిహ్నం - ప్రశాంతి నిలయం' అనే మాట అక్షరసత్యం అనిపించింది. బాబా సందేశం వినడానికి దాదాపు యాభై, అరవైవేల మంది హాజరయ్యారు. నాలుగు వైపులా భద్రతా సిబ్బంది మామూలే. మంచి ఎక్కడ ఉంటుందో చెడు కూడ అక్కడే ఉంటుంది.

"మానవుడు-ఉన్నతి" గురించి చెప్పారు బాబా. "భజన బినా సుఖ శాంతి నహీ... హరినామ బినా ఆనంద్ నహీ..." అని అందరితో భజన చేయించారు. అందరూ లేచి నిలబడి స్వామికి పాదనమస్కారం కోసం చూస్తున్నారు. అవకాశం వచ్చినవారు పాదాల మీద పడ్డారు. బాబా వెళ్ళిపోయారు.

అందరి హృదయాల్లో అనూహ్యమైన ఆనందం వెల్లివిరిసింది.

శర్మలో ఏదో చలనం. 'ఇంతమంది ఈయన్ను కొలుస్తున్నారు. నాకన్నా చాలామంది మంచి స్థితిలో ఉన్నవారే. ఏదో మహాత్మ్యం తప్పకుండా బాబాలో ఉండే ఉంటుంది' అని పరిపరివిధాలుగా ఆలోచిస్తూ ప్రతిమలా నిలబడిపోయాడు.

అనుకోకుండా అక్కడకు వచ్చిన బాబా శర్మ ముందు ఆగారు. స్వామిని చూస్తూనే హైమవతి, విశ్వం పాద నమస్కారం చేసుకున్నారు. శర్మ అయోమయంగా నిలబడే ఉన్నాడు.

"శర్మా, ఎందుకు సంశయం?" అన్నారు స్వామి.

దాంతో శర్మ నిశ్చేష్టుడయ్యాడు. తన పేరు పెట్టి మరీ బాబా పిలిచారు. సంశయం ఎందుకన్నారు. ఈయనలో ఏదో మహాత్మ్యం ఉంది. శర్మకు భయం వేసింది.

"భయం ఎందుకు శర్మా, నేనూ నీలాటి మనిషినే" అన్నారు బాబా.

అందరూ విస్మయంతో చేష్టలుడిగి చూస్తుండిపోయారు. శర్మ అసంకల్పితంగా రెండు చేతులూ జోడించి బాబాకు నమ్మసరించాడు. పాదాల మీద పడి క్షమించమని బాబాను వేడుకున్నాడు. బాబా చిరునవ్వుతో చేయి ఊపుతూ వెళ్లిపోయారు.

విశ్వం శర్మకేసి చూశాడు. నిర్వికారంగా, చలనరహితంగా ఉండిపోయాడు శర్మ. తెలియని తన్మయత్వంలో, భక్తిభావంలో ఉండిపోయాడు. హైమవతి భర్త పాదాల మీద పడి ఆనంద బాష్పాలతో ప్రక్షాళన చేసింది. నిప్పులాంటి శర్మను కప్పిన నివురు తొలగిపోయింది. ■